# కొత్తాట

వారణాసి రామకృష్ణ

ఎప్పుడో, నేను చిన్నతనంలో బ్యాడ్మింటన్ ఆడే రోజుల్లో రాష్ట్రస్థాయి జట్టుకి నేతృత్వం వహించానని నా కొలీగ్ సుందరేశానికి తెలుసు.

అందుకని ఇటీవల అతను నాదగ్గరికొచ్చి "శ్రీనివాస్‌గారూ! మా అబ్బాయి బ్యాడ్మింటన్ బ్రహ్మాండంగా ఆడుతున్నాడు! వాడి ఉత్సాహం చూసి నేనూ ప్రోత్సహించాను.

ఇక మీలాంటి పెద్దలు ఓసారి వచ్చి వాడి ఆట తీరు విశ్లేషిస్తే చాలా సంతోషం" చేతులు కట్టుకుని చెప్పాడు.

సరే- కుర్రాళ్ళని ప్రోత్సహించటం మంచిదే కదా అన్న ఉద్దేశంతో-

"తప్పకుండా సుందరేశన్! మీ వాడు ఆడే గ్రౌండ్ కెళదాం, ఓ రోజు సరాసరి ఆఫీసునుంచే!" అన్నాను.

"గ్రౌండా? భలే వాళ్ళే సార్! మా వాడు గ్రౌండ్లో ఆడడు!"

"గ్రౌండ్లో ఆడడా?"ఆశ్చర్యపోయాను.

"అవున్సార్! మా ఇంట్లోనే పెద్దఖాళీ ప్రదేశం వుంది. దాన్ని బ్యాడ్మింటన్ కోర్టుకిందవాడే మార్చేడు. వాడి ఫ్రెండ్స్ కొందరు కుర్రాళ్ళంతా వచ్చి ఆడుతుంటారు! రేపు ఆఫీసయ్యాక మీరు మా ఇంటికి రావాలి?"

'ఇదెక్కడి పిలుపు!' సరేలెమ్మనుకుని వస్తానని చెప్పాను.

ఆ మర్నాడు సాయంత్రం వెళ్ళాను. డ్రాయింగ్ రూంలో కూర్చోబెట్టి కాఫీ ఫలహారాలయ్యాక సుందరేశన్ "వెళదామా సార్! మా వాడి ఆటతీరు చూద్దురు గాని" అన్నాడు.

నేను లేచి అతన్ని అనుసరించాను. సుందరేశన్ ఇంటి వెనకాలవున్న పెద్ద ఖాళీ ప్లాటుని ఇతగాడు ఆక్రమించేసుకుని బ్యాడ్మింటన్ కోర్టు తయారుచేశాడు. ఒకపక్క డబుల్స్ ఆడే కోర్టులో సగం కోర్టుకి పైగా గీత గీసి మిగతా సగంలో ఒకకుర్రాడు బ్యాట్ పట్టుకుని గట్టిగా అదిలిస్తూ,అరుస్తూ తక్కిన కుర్రాళ్ళతో ఆడుతున్నాడు.

ఆ కుర్రాడివైపు సుందరేశన్ చూపించి-

"అదిగోండి వాడే నా సుపుత్రుడు మారన్! భలే ఆడతాడు లెండి!" నవ్వుతూ చెప్పాడు.

"అది సరే! మీ వాడు ఒక్కడే కోర్టులో నిలబడి ఆడుతున్నాడు. మరి అటువైపు ఇద్దరు ఆడుతున్నారు?" నా సందేహం పసిగట్టి నవ్వుతూ-


"అదేకదా సార్ మా వాడి ప్రత్యేకత! వాళ్ళు ఇద్దరు ఆడేది వీడు ఒక్కడే ఆడతాడు!" చాలా గొప్పగా చెప్పాడు.

"కానీ మీ వాడివైపు కోర్టు సగంపైగా గీత గీసి చిన్నదిగా చేశాడు" చూపించాను.

"అది ఇంకో స్పెషల్ క్వాలిటీ సార్! వాడు అలాగే ఆడతాడు గానీ మీరు వాడి ఆటలోని నైపుణ్యం గమనించి సలహాలివ్వండి!"

ఒప్పుకున్నాక తప్పదు కదా! నోర్మూసుకుని కళ్ళప్పగించి చూడసాగాను.

సదరు మారన్ బాల్ తీసుకుని సర్వీస్ చేశాడు. అవతలి కుర్రాడు నేర్పుగా బాల్ని మారన్ వైపుకి వేసేసరికి దాన్ని అందుకోలేకపోయాడు. న్యాయంగా అయితే పాయింటు ఆ వైపు వెళ్ళి వాళ్ళు బాల్ తీసుకుని సర్వ్ చేయాలి. కానీ మారన్ గట్టిగా అరుస్తూ "రేయ్ సుబ్బారావ్! బాల్ని నా బాట్‌కి అందకుండా వేస్తే ఎట్లారా? బ్యాడ్మింటన్ రూల్ ప్రకారం సర్వీసు చేసినవాడు సులభంగా ఎత్తేలా అవతలివాడు బ్యాట్‌తో కొట్టాలి! తెలిసిందా? ఈ రూల్ నీకు తెలీకపోవటం చేత మొదటి పాయింటు నాకే!" అన్నాడు.



నేను గతుక్కుమని సుందరేశన్ వైపు తిరిగి ఏదో చెప్పే లోగానే అతను నవ్వుతూ- "చూశారా సార్! మావాడికి రూల్స్ భలే తెలుసు!" పొగడటం ప్రారంభించాడు.

మళ్ళీ ఈసారి అవతలి కుర్రాడు మరింత నైపుణ్యంతో బాల్ని కొడితే మారన్ ఎత్తలేక చతికిలపడి పైగా బ్యాట్‌ని ఎత్తి కొడతానన్నట్టు కొరకొరా చూస్తూ-"రేయ్ చలపతీ! నువ్వు కొట్టిన బాల్ నెట్‌కి తగిలి నా వైపు పడింది కదూ?" ప్రశ్నించాడు.

సదరు కుర్రాడు బెదురుతూ-

"నేను చూడలేదు మారన్! ఆ అంకుల్ అంపైర్ కదా అతన్నే అడుగు" అంటూ బాల్‌ని నా కోర్టులో వేశాడు. తప్పదు కదానని.

"లేదు! లేదు!! బాల్ నెట్‌కి తగల్లేదు" నిజాయితీగా చెప్పాను. వెంటనే మారన్ కోపంగా "ఈ అంపైర్‌కి కళ్ళు సరిగ్గా కనిపించడంలేదు! బాలు చక్కగా నెట్‌కి తగిలాకే నా కోర్టులో పడింది! అవునా డాడీ!" అంటూ సుందరేశన్‌తో అనగానే- "అవునవును!" అన్నాడు.

దాంతో మళ్ళీ బాల్ మారన్ తీసుకుని మళ్ళీ సర్వీసు చేశాడు. ఈసారి సర్వీసు చేసిన బాల్ వెళ్ళి అవతలివైపు నున్న లైన్‌కి ఆవల పడగానే చలపతి "అవుట్!" అని అరిచాడు. మారన్ "లేదు! లేదు! నాటవుట్! బాల్ కరెక్టుగానే లోపలే పడింది" అంటూ వాదించాడు.

అప్పటికి మొత్తం విషయం నాకు అర్థమయి- మారన్ దగ్గరికెళ్ళి-

"బాబూ! నువ్వాడే ఆట పేరేమిటమ్మా?" సౌమ్యంగా అడిగాను.

"బ్యాడ్-మింటన్ అంకుల్!" అన్నాడు.

"బ్యాడ్ మింటన్ కాదు బ్యాడ్మింటన్!" సరిచెయ్యబోతే- మారన్ కోపంగా "నేనూ అదే చెప్తున్నానంకుల్! మీరంతా ఆడే ఆటను అలా అంటారేమో కానీ నేను ఆడే ఆటను మాత్రం బ్యాడ్-మింటన్ అంటారు!" గట్టిగా అన్నాడు.

"ఈ ఆటకి రూల్స్ అన్నీనేనే ఫ్రేమ్ చేశానంకుల్! నేను సర్వీసుచేస్తే అవతలివాళ్ళు ఎత్తకూడదు! అలాగే వాళ్ళు సర్వీసు చేసేప్పుడు బ్యాట్‌తో కాకుండా చేత్తో బాల్‌ని విసరాలి! ఇక నాకు అవుట్ అన్న ప్రశ్నే లేదు. ఒకవేళ వాళ్ళు వేసిన బాల్‌ని నేను ఎత్త లేకపోతే అది నెట్‌ని తగిలిందని కానీ లైన్‌కి అవతల పడిందని కానీ ఒప్పుకుని తీరాలి!"

"ఇన్ని రూల్స్ పెట్టేకంటే నువ్వే ఎప్పుడూ గెలుస్తుంటావు కాబట్టి అసలు ఆటే లేకుండా నీకు నువ్వే 'విజేత' అని ప్రకటించు మారన్!"

నావంక విసుగ్గానూ ఒక వెర్రివాడ్ని చూసినట్టుగానూ చూసి "నువ్వెక్కడో పిచ్చాడిలావున్నా వంకుల్!మనం ఆట ఆడినట్టు జనాలందరికీ తెలియాలికానీ ఆడకుండానే మనం గెలిచేసినట్టు చెప్పుకోకూడదు!"

కొత్త సిద్ధాంతం చెబుతున్న కొడుకు వంక సుందరేశన్ ప్రశంసగా చూసి "ఇంతకీ మావాడు బ్యాడ్మింటన్ ఆటలో బాగా పైకొస్తాడా రాడా చెప్పు గురూ!" అడిగాడు. నేనో క్షణంపాటు అటుఇటు చూసి-

"చూడు సుందరేశన్! మీ వాడి చేత బ్యాడ్మింటన్ ఆడటం మానిపించి వెంటనే రాజకీయాల్లో చేర్పించు! గ్యారెంటీగా ముషారఫ్ అంతటి వాడవుతాడు!"

పాకిస్తాన్‌లో ఎన్నికలపేరిట, ప్రజాస్వామ్యం పేరిట ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలన్నీ నా కళ్ళ ముందు తిరుగుతుంటే అలా చెప్పాను.

సుందరేశన్ చాలా సంతోషంగా కొడుకుని పిలిచి పుత్రోత్సాహంతో ఊగిపోతూ-

"ఒరే మారన్! నువ్వు బ్యాడ్-మింటన్ వదిలేసి వెంటనే రాజకీయాల్లో చేరిపోరా" చెప్పాడు.

దానికి వాడు తల అడ్డంగా ఊపుతూ "నథింగ్ డూయింగ్ డాడ్! రాజకీయాల్ని, క్రీడల్ని మొత్తం వ్యవస్థల్ని రద్దుచేసి నేనొక్కడ్నే జీవితాంతం పాలించేలా విధానాల్ని రూపొందిస్తా!" గట్టిగా చెబుతున్న మారన్ మొహం నాకెందుకో అచ్చంగా ముషారఫ్ మొహంలాగే కనిపించింది!